సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 14 । జనవరి । 2025

సంబరాల సంక్రాంతి


ముంచంగిపుట్టులో భోగి మంట


పాతగంగవరంలో భోగి మంట వద్ద మహిళల సందడి


రాజవొమ్మంగిలో ఓ ఇంటిలో చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న మహిళలు

మంచు దుప్పట్లో ఎగసి పడే వెచ్చని భోగి మంటలు.. ఘుమఘులాడే పిండి వంటలు.. నేలమ్మకు వన్నెలద్దిన రంగవల్లులు.. నూతన శోభను తెచ్చిన కొత్త వస్త్రాలు.. హరిదాసుల కీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. కనుల పండువగా గోదా రంగనాథుల కల్యాణోత్సవాలతో సోమవారం భోగి పండగను వైభవంగా జరుపుకొన్న జిల్లా ప్రజలు మంగళవారం మకర సంక్రాంతికి సిద్ధమయ్యారు.. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారంతా ఇప్పటికే స్వగ్రామాలకు చేరుకున్నారు. అనవాయితీగా పిల్లలకు భోగిపండ్లు పోసి, పెద్దలు ఆశీర్వదించారు. చిన్నారులు, యువకులు గాలిపటాలతో సందడి చేశారు.

- సాక్షి,పాడేరు/రాజవొమ్మంగి/గంగవరం

కమనీయం... కల్యాణం

రంపచోడవరం: భోగి పండగను పురస్కరించుకుని నారాయణగిరిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణ మహోత్సావాన్ని ఆలయ అర్చకులు అద్దంకి వెంటకటేశ్వరరావు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


అడ్డురోడ్డు వద్ద కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు

జోరుగా కోడి పందేలు
చేతులు మారుతున్న రూ.కోట్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా జరుగుతున్నాయి. ప్రధానంగా పాయకరావుపేట, యలమంచిలి నియోజక వర్గాల్లో ప్రత్యేకంగా టెంట్లు వేసి మరీ పందాలు నిర్వహించగా... మిగిలిన ప్రాంతాల్లో తోటలు, ఖాళీ స్థలాల్లో బరులు ఏర్పాటు చేసి పందేలు జరుపుతున్నారు. ఒక్కో బరి వద్ద రూ.వేలల్లో పందెం నడుస్తోంది. ఈ పందేలు చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. ప్రధానంగా కూటమి పార్టీల్లోని నేతలు ఈ కోడి పందేల నిర్వహణ సారథ్య బాధ్యతలు చేపట్టారు. మరోవైపు ఈ కోడి పందేలు కొనసాగుతున్న ప్రాంతాల వైపు వెళ్లొద్దంటూ అనధికారికంగా పోలీసులకు ఆదేశాలు ఉన్నట్టు సమాచారం. దీంతో కనుచూపు మేరలో కోడి పందేలు కొనసాగుతున్నా అటువైపుగా వెళ్లేందుకు ప్రయత్నించలేదు. మూడు రోజుల పాటు వీటిని నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. విశాఖ జిల్లాలో భీమిలి, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు.

- ఉమ్మడి విశాఖ జిల్లాలో పలుచోట్ల బరులు
- కోడి పందేలతో పాటు పేకాట, లాటరీ బాల్ నిర్వహణ
- పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో భారీగా నిర్వహణ
- చూసీచూడనట్టు ఉండాలని పోలీసు శాఖకు ఆదేశాలు

లాటరీ బాల్‌కు వేలం పాట!

ఈ కోడి పందేలు యలమంచిలి నియోజకవర్గంలో రామన్నపాలెం, పాయకరావుపేట నియోజకవర్గంలో అడ్డురోడ్డుతో పాటు అన్ని ప్రాంతాల్లో భారీగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పందేల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. వేలాది మంది ఆయా ప్రాంతాల్లో పోటీలను తిలకిస్తున్నారు. అయితే కోడి పందేలతో పాటు లాటరీ బాల్, పేకాటలను కూడా నిర్వహిస్తుండటం గమనార్హం. అక్కడకు వచ్చిన అనేక మంది ఆటవిడుపు కోసం వీటిని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా వీటి నిర్వహణ ఎవరికి దక్కాలనే విషయాన్ని తేల్చేందుకు లాటరీ నిర్వహించడం గమనార్హం. లాటరీలో దక్కించుకున్న వారు మాత్రమే కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో లాటరీ బాల్, పేకాటలను నిర్వహించాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో పాట పాడి వీటి నిర్వహణ బాధ్యతలను కూటమి నేతలు దక్కించుకున్నట్టు తెలుస్తోంది. ఒకవైపు హోం మంత్రి ఇలాకా.. మరోవైపు జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నియోజకవర్గాల్లోనే ఈ దఫా భారీగా కోడి పందేలు జరగడం గమనార్హం. ఇక నర్సీపట్నం, అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లోనూ కోడి పందేలు జరుగుతున్నాయి.




అచ్యుతాపురం మండలం రామవరం వద్ద కోడి పందేలు

రూ.లక్షల్లో బెట్టింగ్‌లు..!



యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో రంజుగా పందేలు కొనసాగుతున్నాయి. దీంతో విశాఖ నగరానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు అక్కడనే తిష్ట వేశారు. రూ.వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగులు వేస్తూ పందేలు నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ప్రధానంగా కూటమిలోని నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పందేల్లో సుమారు రూ. 2 కోట్ల మేర నగదు లావాదేవీలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అటు కోడి పందేలతో పాటు ఇటు లాటరీ బాల్, పేకాట కూడా నిర్వహిస్తున్నారు. అక్కడ భారీగా మద్యం కూడా బహిరంగంగానే సేవిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు జనం తరలివెళ్తున్నప్పటికీ కనీసం అటువైపు ఒక్క పోలీసు అధికారి కానీ.. ఎక్సైజ్ సిబ్బంది కానీ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. వీటి నిర్వహణ కోసం అన్ని డిపార్టుమెంట్లకు భారీగా మామూళ్లు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇస్రో శాస్త్రవేత్తగా రాజేంద్రపాలెం యువతి


మణిజ్యోతిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

కొయ్యూరు: భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో శాస్త్రవేత్తగా మండలంలోని రాజేంద్రపాలేనికి చెందిన యువతి మావూరి మణిజ్యోతి ఎంపికయ్యారు. ఇస్రో సెంట్రలైజ్‌డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో ఫలితాలు ప్రకటించగా ఎలక్ట్రానిక్స్ విభాగంలో శాస్త్రవేత్తగా ఎంపికైనట్టు ఆమె తల్లిదండ్రులు నాగేశ్వరరావు(శివరామ్ టైలర్), పద్మ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఆమెను తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి

మణిజ్యోతి 1నుంచి 5వ తరగతి వరకు రాజేంద్రపాలెం ప్రాథమిక పాఠశాలలోను, 6, 7 తరగతులు కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలోను, 8,910 తరగతులను అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో చదివారు. కాకినాడ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో, ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్(ఈసీ)లో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె ఇస్రోలో సాంకేతిక సహాయకురాలుగా పనిచేస్తున్నారు.

చింతపల్లి ఏఎస్పీగా నవజ్యోతి మిశ్రా



చింతపల్లి: చింతపల్లి ఏఎస్పీగా 2021 బ్యాచ్‌కు చెందిన నవజ్యోతి మిశ్రాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈయన ఎంఏ ఎకనామిక్స్ చదివారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో గల జవహర్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో రీసెర్చ్ చేస్తున్నారు.బిహార్ రాష్ట్రానికి చెందిన ఈయన ప్రస్తుతం అస్సాల్ట్ కమాండర్‌గా గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు.


రాజగోపురం ఎదురుగా భోగి మంట


సంబరాల్లో గంగిరెద్దులు, జంగం దేవర, కొమ్ముదాసరి, హరిదాసులు


భోగిమంట వెలిగిస్తున్న ఈవో త్రినాథరావు

సింహగిరిపై..

సింహాచలం: సింహగిరిపై సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా దేవస్థానం అధికారులు సంబరాలను నిర్వహించారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సంక్రాంతి సంబరాలను కూడా తనివితీరా తిలకించారు. ఉదయం ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. అనంతరం భక్తులు పిడకలను భోగిమంటలో వేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ రాంబాబు పాల్గొన్నారు. సింహగిరి మాడ వీధుల్లో ఏర్పాటుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గొబ్బెళ్ల ముత్యాల ముగ్గులు, చెరుకు గెడల జాలువలు, ఎడ్లబండి, నాగళ్లు, పూరిగుడెసెలు, గడ్డిమోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ట్రాక్టర్‌ను భక్తులు తిలకించారు. జంగం దేవర, కొమ్ముదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్ల విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ధాన్యం గుట్టల వద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. కుమ్మరి తయారుచేసే మట్టి వస్తువులను ఆసక్తిగా తిలకించారు. పూలతో చేసిన వరాహ స్వామి, శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యరూపం ఆకర్షణీయంగా నిలిచాయి.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు

- చార్జీల పెంపుపై సీపీఎం, ఆదివాసీ గిరిజన సంఘం నిరసన


పాడేరులో భోగి మంటలో విద్యుత్ బిల్లుల నమూనాలు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు


చింతూరులో దహనం చేస్తున్న సీపీఎం నాయకులు


భోగి మంటలో విద్యుత్ బిల్లులను వేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్

పాడేరు రూరల్/అరకులోయ/చింతూరు: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసగా సోమవారం విద్యుత్ బిలుల్లను భోగి మంటల్లో వేసి పాడేరు, చింతూరు,అరకులోయలలో సీపీఎం నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు దహనం చేశారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని చెప్పారు. స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుందరరావు, నాయకులు దాసు,చిన్నారావు,చలపతి,రాంబాబు, సింహాద్రి, పార్వతమ్మ, కాసులమ్మ పాల్గొన్నారు. చింతూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఎంపీటీసీ వేకా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. పెంచిన సర్ చార్జీలు, సర్దుబాటు బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శరభగుడ హౌసింగ్ కాలనీకి చెందిన ప్రభుదాస్, స్టాలిన్ దేవ్, భరత్ దేవ్, హస్మీదేవ్, సోమేష్‌కుమార్, చైతన్య, ప్రదీప్, సుమిత్ర, బాకా మోజేష్‌దాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. సోమవారం డుంబ్రిగుడలో 8.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో జీకే వీధిలో 8.6 డిగ్రీలు,జి.మాడుగులలో 8.9, చింతపల్లిలో 9.1, అరుకువేలిలో 9.6, హుకుంపేటలో 10.1, అనంతగిరిలో 10.6, పెదబయలలో 10.8, పాడేరులో 11.2, ముంచంగిపుట్టులో 11.5, కొయ్యూరులో 13.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు.ఉదయం 10 గంటలు వరకూ మంచు అధికంగా కురుస్తోంది.


చింతపల్లిలో కురుస్తున్న మంచు

సెలవుల వేళ.. పర్యాటకుల హేల


మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద..


కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు




గిరిజన మ్యూజియం వద్ద పర్యాటకుల రద్దీ

అరకులోయటౌన్: సంక్రాంతి పండగ సెలవులు రావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీ అరకులోయకు సోమవారం టూరిస్టులు పోటెత్తారు. మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్‌కు తెల్లవారు జాము నుంచి కార్లు, జీపులు, ద్విచక్రవాహనాలలో వెళ్లి అక్కడి సూర్యోదయ అందాలను వీక్షించారు. బోసుబెడ గ్రామ హైవే వద్ద ఏర్పాటు చేసిన అరకు గోకార్టింగ్‌లో కార్లను డ్రైవ్ చేస్తూ పిల్లలు కేరింతలు కొట్టారు. గిరిజన మ్యూజియంతో పాటు టూరిస్టు స్పాట్‌లలో సందర్శకుల సందడి నెలకొంది.

కొత్తపల్లి జలపాతం వద్ద...

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం వద్ద సోమవారం పర్యాటకులు సందడి చేశారు. జలపాతం నీటి ప్రవాహంలో గంటలు తరబడి కేరింతలతో స్నానాలు చేశారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ జలపాతం వద్ద వ్యూపాయింట్లలో సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆట పాటలతో రోజంతా ఎంజాయ్ చేశారు.

లంబసింగికి పర్యాటకుల తాకిడి

చింతపల్లి: ఆంధ్రాకాశ్మీర్ లంబసింగిలో పర్యాటకుల రద్దీ పెరిగింది. సోమవారం తెల్లవారునుంచే కుటుంబాలతో లంబసింగి చేరుకుని ప్రకృతి సోయగాలను ఆస్వాదించారు. లంబసింగితో పాటు చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలను తిలకిస్తూ సెల్ఫీలు,ఫొటోలు తీసుకొని ఆనందంగా గడిపారు. తాజంగి జలాశయం వద్ద జిప్ లైనర్ ఎక్కడం తో పాటు బోటు షికారు చేశారు.

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతానికి సోమవారం పర్యాటకులు పోటెత్తారు. గంటల తరబడి జలపాతంలో జలకాలాడారు. గిరిజన కళాకారులతో కలిసి ధింసా నృత్యం చేశారు. అరకు పైనరీ వద్దకూడా టూరిస్టులు సందడి చేశారు.


అరకు గో కార్టింగ్‌లో కార్లతో పిల్లల సందడి


చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

క్లుప్తంగా

జంగమదేవరల సందడి



రాజవొమ్మంగిలో వీధుల్లో తిరుగుతున్న జంగమయ్యలు

రాజవొమ్మంగి: సంక్రాంతి పండగ నేపథ్యంలో జంగమ దేవరలు ఇంటింటికి తిరుగుతూ సందడి చేశారు. పూర్వీకుల వృత్తాంతాలను తెలుపుతూ ఆకట్టుకున్నారు. శంఖం పూరిస్తూ హర హర మహాదేవ అంటూ ఇంట్లోవారిని దీవించారు. స్థానికులు జంగమదేవరలకు శక్తి కొలది బహుమతులు ఇచ్చి సాగనంపారు. శివ భక్తులైన జంగమదేవరల ఆశీస్సులు పొందేందుకు పలువురు ఆసక్తి చూపారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం: స్థానిక కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ధనుర్మాసం నెల చివరి రోజు సందర్భంగా గ్రామోత్సం నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి సీతాసమేత రామచంద్రమూర్తి, లక్ష్మణ హనుమాన్ సరివారంతో పల్లకీ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, వీహెచ్‌పీ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



పైదిగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఆర్‌వో కరుణాకర్

కూనవరం: సంక్రాంతి ఆచారాల పేరుతో అడవుల్లో వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తప్పవని స్థానిక రేంజ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్ హెచ్చరించారు. మండల పరిధిలోని జగ్గవరం జంక్షన్, పైదుగూడెం, భైరవపట్నం గ్రామాలను ఆయన సందర్శించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువులను వేటాడటం నేరమన్నారు. అడవిలో వేట వద్దు–అడవి జంతువులే ముద్దు, అడవులే ఆనందం –జంతువులే జీవం వంటి ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వి.శంకర్ రెడ్డి, ఎఫ్‌డీవోలు ఎస్.నాగలక్ష్మి, డి.సుబ్బయ్య, సూరయ్య, జంపన్నరాజు, ముర్మూరు బేస్ క్యాంపు సిబ్బంది భద్రం, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఆయుష్’కు ఊపిరి

- త్వరలో అందుబాటులోకి కళాశాల,టెస్టింగ్ ల్యాబ్
- విమ్స్‌లోకి మధురవాడ ఆర్‌డీడీ కార్యాలయం
- డిస్పెన్సరీల్లో ఆరోగ్యకరమైన వాతావరణం
- కొత్తగా 39 మంది ఆయుర్వేద వైద్యులు
- ఆరు జిల్లాల్లో 22 డిస్పెన్సరీలు ఏఏఎంలుగా మార్పు
- ‘సాక్షి’తో ఉమ్మడి మూడు జిల్లాల ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మి



మాట్లాడుతున్న విశాఖ ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మి

మధురవాడ: ఆయుష్ వైద్యానికి మంచి రోజులు రాబోతున్నాయా అంటే నిజమనే చెప్పాలి. దీని పరిధిలోని ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియో, తదితర కేంద్రాల అభివృద్ధి కోసం అనేక ఏళ్లుగా ప్రతిపాదనల దశలోనే ఉండిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా నేచురోపతి అభివృద్ధికి కీలక అడుగులు పడ్డాయి. ఇందులో భాగంగానే విమ్స్‌లో నేచురోపతి కాలేజ్, అదే ప్రాంగణంలో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి, శొంఠ్యాంలో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ వంటివి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులు దాదాపుగా చివరి దశకు వచ్చాయి. తాజాగా 39 డిస్పెన్సరీలకు కొత్తగా 39 మంది వైద్యులు నియమితులయ్యారు. ప్రకృతి వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దానేటి ఝాన్సీ లక్ష్మి పేర్కొన్నారు. ఆయుష్‌కు సంబంధించి పలు అంశాలను ‘సాక్షి’తో పంచుకున్నారు. మధురవాడ ఆయుష్ రీజినల్ కార్యాలయం పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 113 సెంటర్లు ఉన్నాయి. 31 ఎన్‌హెచ్‌ఆర్‌ఎం కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఏడాది క్రితమే 22 డిస్పెన్సరీలకు అదనపు వసతులు, సిబ్బందిని కేటాయించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అప్‌గ్రేడ్ చేశారు. అలాగే విజయనగరం, కోటబొమ్మాళి, కన్నూరుపాలెంలను స్పెషల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అభివృద్ధి చేశారు.

కరోనా తర్వాత పెరిగిన ప్రాధాన్యం

కరోనా తర్వాత ఆయుర్వేద, హోమియో వైద్యంపై ప్రజలకు మరింత అవగాహన పెరిగింది. ప్రస్తుతం ప్రతి కేంద్రం పరిధిలో దాదాపు 50 మందికి తగ్గకుండా రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. దీనికి అనుగుణంగా వైద్యుల సంఖ్య పెరిగింది. డిస్పెన్సరీల్లో మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

త్వరలో అందుబాటులోకి కళాశాల, ఆస్పత్రి

విమ్స్‌లో నేచురోపతి మెడికల్ కళాశాల, అదే ప్రాంగణంలో 50 పడకలతో ఆయుష్ ఆస్పత్రి, ఆనందపురం మండలం శొంఠ్యాంలో సుమారు రూ.7కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌ల నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఇవి రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

విమ్స్‌కి మధురవాడ కేంద్రం కార్యాలయం తరలింపు

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో ఉన్న పలు ఆస్పత్రులకు కేంద్రంగా పనిచేస్తున్న మధురవాడలోని ఆర్‌డీడీ కేంద్రం పూర్తిగా శిథిలస్థితికి చేరుకుంది. కనీస సదుపాయాలే కాదు. రక్షణ కూడా కూడా లేదు. దీంతో కార్యాలయం విమ్స్‌లోకి తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. మధురవాడలో భవనం పూర్తిగా అందుబాటులోకి వస్తే తిరికి మళ్లీ వెనక్కు రావచ్చు. చాలా చోట్ల డిస్పెన్సరీల్లో కనీస సదుపాయాలు లేని విషయం వాస్తవమే. అయితే ఇక్కడ మరిన్ని వసతులు, ఆరోగ్య కరమైన వాతావరణం కల్పిస్తాం.

మధురవాడలో 10 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు

ఇక్కడ ఆర్‌డీడీ కేంద్రం నిర్మాణంతో పాటు 10 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. ఈ ప్రాంతంలో మరిన్ని ఆయుష్ సేవలు విస్తృతం అయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం ఏపీఎంఎస్ఐడీసీ సంస్థ రూ.7కోట్లతో అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఘనంగా తొలి తీర్థం

చోడవరం: భోగి పండగ రోజు నుంచే తీర్థాలు ప్రారంభమయ్యాయి. ఆదిదేవుడైన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. భోగి పండగను పురస్కరించుకొని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో స్వామి తిరువీధోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టే బెలూన్లు, పిండివంటలు, పంచదార చిలుకలు అమ్మడంతో వాటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపారు. రంగులరాట్నాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థం అంతా సందడి చోటుచేసుకుంది. ఆలయం వద్ద 400మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలిపతిరావు, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కూరగాయల తీర్థం : జిల్లాలో ఎక్కడా జరగని విధంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద సందడిగా కూరగాయల తీర్థం జరిగింది. సంక్రాంతి పండగలో రైతులు పండించిన కొత్త పంటలే ముఖ్యం కావడంతో ఆ పంటలను ఈ తీర్థంలో విక్రయిస్తారు. ప్రధానంగా చోడవరం పరిసర గ్రామాల్లో పండిన రకరకాల కూరగాయలన్నీ ఈ తీర్థంలో అమ్మకానికి ఉంచారు. ఈ కూరగాయల తీర్థంలో కూరగాయలు కొనుగోలుచేసి సంక్రాంతి రోజున పూజ చేస్తే మంచి జరుగుతుందని ప్రతీతి. భోగి పండగను మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన కుటుంబసభ్యులతో సోమవారం తన స్వగ్రామమైన కేజే పురంలో సందడిగా జరుపుకొన్నారు. స్థానిక రామాలయంలో భజనలు, కీర్తనలు ఆలపించారు.

300 బస్సులు నడిపిన ఆర్టీసీ

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం 300 ప్రత్యేక సర్వీసులు నడిపినట్లు ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, పలాస, టెక్కలి రూట్లలో ప్రయాణికులను ఎప్పటికప్పుడు క్లియర్ చేసినట్లు పేర్కొన్నారు. ద్వారకా బస్ స్టేషన్‌లో గల పలు దుకాణాలను ఆయన పలువురు అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించారు. స్టాళ్లలో ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలని ఆదేశించారు. స్టాళ్ల వద్ద ధర పట్టిక పెట్టాలని, క్వాలిటీ మెయింటైన్ చేయాలని, తూనికలు సరిగ్గా ఉండాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్ అండ్ డిపో) పీబీఎంకే రాజు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, సూపర్‌వైజర్ ఎంవీ రావు పాల్గొన్నారు.

ఖాతాదారులకు తప్పని అవస్థలు

- మూతబడిన ఏటీఎంలతో ఇక్కట్లు
- పట్టించుకోని బ్యాంకర్లు



మూతబడి ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయలో ఏటీఎంల సమస్య వెంటాడుతోంది. నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులకు చెందిన 10కి పైగా ఏటీఎంలున్నాయి. వీటిలో సగానికా పైగా పనిచేయడంలేదు. మరికొన్ని ఏటీఎంలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి, ఏటీఎంల ఏర్పాటులో హడావుడి చేసే బ్యాంక్ అధికారులు వాటి నిర్వహణకు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. సంకాలంలో నగదు తీసుకోవాలంటే పలు ఏటీఎంలకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఖాతాదారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయం ఎదురుగా ఉన్న రెండు ఏటీఎంలలో ఒకటి నిత్యం మూతబడి ఉంటుందని, మరోక ఏటీఎంలో క్యాష్ లేనట్లు చూపిస్తుంటుందని ఖాతాదారులు చెబుతున్నారు. డబ్బులు అవసరమైన స్థానికులతో పాటు పర్యాటకులు ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్‌ల వద్ద నగదు తీసుకుంటే రెండు శాతం చార్జీ చేస్తున్నారని, దీంతో నష్టపోతున్నామని పలువురు ఖాతాదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

భలే ప్రేమ ‘చిహ్నం’



కళ్లల్లో ఉదయించి.. కనుమూసినా.. తోడుంటుంది ప్రేమ. శిశిరమైనా.. శిథిలమైనా.. ప్రేమమయమే సుమా అని అన్నాడో కవి. ప్రేమిస్తే.. ప్రపంచమంతా మనసిచ్చిన మనిషిలోనే కనిపిస్తుంది. విరిసే ప్రతి పువ్వులోనూ.. కురిసే ప్రతి చినుకులోనూ ప్రేమ కనిపిస్తుందంటారు. ఇదిగో.. ఇప్పుడీ బంగాళా దుంపలోనూ ప్రేమకు చిహ్నం పలకరిస్తోంది. లలితానగర్‌లో కూరగాయలు అమ్మే కొరిబిల్లి మహేష్ తీసుకొచ్చిన బంగాళాదుంపల్లో.. ఈ దుంప మాత్రం అందర్నీ ఆకట్టుకుంది. గుండె గుప్పెడంత కాదు.. ఈ బంగాళా దుంపంత అని చెప్పుకుంటున్నారు. ఇంకొందరు ఈ దుంపని చూసి.. ఏంటో ఈ దుంపలో ప్రేమ అని మాట్లాడుకున్నారు.

–ఫొటో : సాక్షి,విశాఖపట్నం

అమ్మో.. పెద్ద పులి

ప్రయాణికులను వెంటాడుతున్న భయం

గూడెంకొత్తవీధి: మండలంలోని సీలేరు అటవీ రేంజ్ పరిధిలో పరిసర గ్రామాల ప్రజలకు పులి భయం పట్టుకుంది.సప్పర్ల రెయిన్ గేజ్ వద్ద ఆదివారం పెద్దపులి ప్రయాణికుల కంటపడింది. ఈ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికులతో పాటు జిల్లాకు వచ్చి వెళ్లే ప్రయాణికులను భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆదివారం దారకొండ సంతలో పులి ప్రచారంపై గిరిజనులను అప్రమత్తం చేయడంతో మరింతగా భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే దారకొండ మార్గంలో తగినన్ని ఆర్టీసీ సర్వీసులు లేవు. రోజులో నాలుగైదు సర్వీసులు మాత్రమే తిరుగుతాయి. దీంతో చాలా వరకూ గూడెంకొత్తవీధినుంచి సీలేరు, దారకొండ, సప్పర్ల, ఒడిశా వంటి ప్రాంతాలకు ప్రైవే టు వాహనాలపైనే ఆధారపడుతుంటారు. అత్యధిక శాతం మంది ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో అధికంగా సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది ఉన్నారు. వీరితోపాటు వారపు సంతలకు వెళ్లే వ్యాపారులు ఆటోలు, జీపులు తదితర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దారకొండ దారాలమ్మను దర్శించుకునేందుకు ప్రతిరోజూ అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. గురు, ఆదివారాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పండగలు, సెలవు దినాల్లో ఆలయానికి భక్తులు పోటెత్తుతారు. ప్రధాన రహదారిపై పెద్దపులి సంచరిస్తుందన్న వార్తలు రావడంతో ఈమార్గంలో వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని పెద్దపులి సంచారంపై స్పష్టమైన ప్రకటన చేయాలని, దానిని బంధించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి

విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న కొమ్మూరి శ్రీనివాసరావు

మునగపాక: మునగపాకలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన కొమ్మూరి శ్రీనివాసరావు–ప్రవల్లిక దంపతులు రూ.1,11,116, పాటిపల్లికి చెందిన ఆడారి సత్యనారాయణ రూ.2 లక్షలు, దాడి వెంకటరమణ, దాడి పరదేశినాయుడుల జ్ఞాపకార్థం వారి కుమారులు అశోక్ కుమార్, అరుణ్‌కుమార్ రూ.55,555, తిమ్మరాజుపేటకు చెందిన భీశెట్టి లక్ష్మణరావు రూ.50 వేలు, తిమ్మరాజుపేటకు చెందిన భీమిశెట్టి అప్పలనాయుడు కుమారులు గణేష్, డాక్టర్ భాస్కరరావు రూ.50 వేలు, వెంకటాపురానికి చెందిన రేఖా తాతారావు రూ.20 వేలు, మునగపాకకు చెందిన మళ్ల జగ్గప్పారావు రూ.50 వేలు వంతున విరాళంగా అందజేశారు. కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పెద్దలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహన రావు, పొలిమేర కృష్ణ, ఆడారి కృష్ణ, వెలగా సురేష్‌కుమార్, బొడ్డేడ రామునాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సందట్లో సడేమియా...!

- మాయమవుతున్న మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ఇసుక!
- పండగ సెలవుల్లో రాత్రి వేళల్లో ఇసుక తరలించేందుకు ప్రయత్నాలు
- సీజ్ చేసి నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం
- పాత రెవెన్యూ అధికారులు బదిలీతో పర్యవేక్షణ కరువు



చమ్మచింతలో అర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే గుట్టగా వేసిన మైనింగ్‌శాఖ అధికారులు సీజ్ చేసిన ఇసుక

నాతవరం: మైనింగ్‌శాఖ అధికారులు సీజ్ చేసిన ఇసుకను పండగ సమయంలో గుట్టుచప్పుడు కాకుండా కూటమి నేతలు అధికార అండతో తరలించేందుకు ప్రయత్నం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తాండవ నదిలో నిబంధనలు ఉల్లఘించి అనుమతులు లేకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీనిపై అప్పట్లో పత్రికల్లో వార్తలు రావడంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి తాండవ నదిలో ఇసుక తవ్వకాలపై దాడులు చేశారు. చమ్మచింత వద్ద తాండవ నదిలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు జరిపినట్టుగా నిర్ధారించారు. కొంత మొత్తంలో ఇసుక తరలించగా మరికొంత ఇసుక చమ్మచింత గ్రామంలో నిల్వ చేసారు. నిల్వ చేసిన ఇసుకను గత ఏడాది అప్పటి తహసీల్దార్ ఎస్.ఎస్.వి శ్రీనివాసనాయుడు, మైనింగ్ అధికారులు పట్టుకోని సీజ్ చేశారు. అప్పట్లో పట్టుబడిన ఇసుక సుమారుగా 100 ట్రాక్టర్లు పైగా ఉంటుందని మైనింగ్‌శాఖ అధికారులు లెక్కించారు. పట్టుబడిన ఇసుక మైనింగ్‌శాఖ అధికారులు సీజ్ చేసి చమ్మచింత గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్దనే స్టాకు చేశారు. సీజ్ చేసిన ఇసుకను తరలించకుండా పర్యవేక్షణ భాద్యత రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కొంతకాలం పాటు ఇసుక గుట్ట వద్ద రెవెన్యూ శాఖ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉండేవారు. అప్పట్లో పని చేసిన తహసీల్దార్ ఇతర సిబ్బంది బదిలీలో భాగంగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకపై పర్యవేక్షణ లేకుండా నిరక్ష్యం చేశా రు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికార పార్టీ నాయకులు ఒత్తిడులకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారు. సంక్రాంతి పండగ రావడం అధికారులు పూర్తిగా ఇసుకపై పర్యవేక్షణ కొరవడడంతో కొందరు గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలించుకుపోతున్నారు. సీజ్ చేసిన ఇసున నిల్వ లు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని స్థానికులు చెబతున్నారు. సంక్రాంతి పండగ సెలవులు కారణంగా రెవెన్యూ మైనింగ్‌శాఖ అధికారులు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో కూటమి నేతలు దర్జాగా ఇసుక తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా గ్రామంలో ప్రచారం జోరుగా జరుగుతుంది.